సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం | 27 | అక్టోబర్ | 2023



అన్నదానానికి రూ.1.10 లక్షల విరాళం

గోకవరం: దేవీ నవరాత్రుల ముగింపును పురస్కరించుకుని స్థానిక వీరభద్రుని గద్దెలో నిర్వహించే అన్నదానానికి ఆధ్యాత్మిక వేత్త కంబాల శ్రీనివాస్ రావు రూ.1.10 లక్షలు విరాళం సమర్పించారు.



ఆనందం నిండేలా.. ఆహ్లాదం పంచేలా

చెరువులకు పునరుజ్జీవం వస్తోంది.. చూడచక్కగా ఆహ్లాదాన్ని పంచేలా సిద్ధమవుతున్నాయి.. చుట్టూ వనాలు, జిమ్, ఆట పరికరాలతో అభివృద్ధి సంతరించుకోనుంది.

8 లో

8,900 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం డెల్టా కాలువలకు 8,900 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 4,300, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 2,000 క్యూసెక్కులు వదిలారు. ఫ్లషింగ్ ఆపరేషన్ కారణంగా పశ్చిమ డెల్టాకు నీటి విడుదలను తగ్గించారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఈ–క్రాప్ ముసాయిదా జాబితా ప్రచురణ

ముమ్మిడివరం: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 2,61,694 ఎకరాలకు సంబంధించి ఈ–క్రాప్ నమోదు ముసాయిదా ప్రచురించామని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నుంచి 29 వరకూ జిల్లాలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. సామాజిక తనిఖీ కోసం గ్రామసభల ద్వారా ఈ–క్రాప్ వివరాలు తెలియజేస్తున్నామన్నారు. ముసాయిదా జాబితాలో అభ్యంతరాలుంటే సంబంధిత రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద క్షేత్ర స్థాయి సిబ్బందిని సంప్రదించి లిఖిత పూర్వకంగా తెలపాలని ఆయన సూచించారు.

కర్ర సాము చేసి.. ఆకట్టుకుని



దసరా సంబరాల్లో కర్రసాము చేస్తున్న డీఎస్పీ అంబికా ప్రసాద్

అమలాపురం టౌన్: స్థానికంగా జరిగిన సంప్రదాయ దసరా మహోత్సవాల్లో అమలాపురం డీఎస్పీ అంబికా ప్రసాద్ కర్రసాము చేసి అందరినీ ఆకట్టుకున్నారు. గురువారం ఉదయం దసరా ఊరేగింపు పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అక్కడే వీధుల్లో బందోబస్తులో ఉన్న డీఎస్పీ అంబికా ప్రసాద్ ఇద్దరు చిన్నారుల చెడీ తాలింఖానా ప్రదర్శన తిలకించారు. రెండు వీధుల నిర్వాహక కమిటీ సభ్యుల కోరిక మేరకు సంప్రదాయాన్ని గౌరవిస్తూ డీఎస్పీ కర్రసాము చేశారు. దీంతో నిర్వాహక కమిటీలు డీఎస్పీని చేతులతో ఎత్తుకుని ఆనందం వ్యక్తం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ దసరా మహోత్సవాల్లో తాను విద్యార్థిగా ఉన్న సమయంలో కర్రసాము నేర్చుకున్నానని తెలిపారు.

జిల్లాలో 52 పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం ప్రసాద్

మామిడికుదురు: కోనసీమ జిల్లాలో తాజాగా 52 పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి మంజూరు చేశామని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్ తెలిపారు. మామిడికుదురులో నారియల్ భారత్ న్యూట్రా ప్రొడ్యూసర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్ నయినాల వేణుగోపాల్ అధ్యక్షతన గురువారం పలు రైతు సంఘాల ప్రతినిధులతో సమావేశం జరిగింది. కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ పథకాలపై అవగాహన, బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 72 యూనిట్లు ఏర్పాటు చేయాలనేది లక్ష్యమన్నారు. 154 యూనిట్లకు దరఖాస్తులు అందాయన్నారు. ఇందులో 52 యూనిట్లకు అనుమతి ఇచ్చామన్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు, గార్మెంట్స్, పశువుల పెంపకం, సెంట్రింగ్ తదితర యూనిట్లకు అవకాశం ఉందన్నారు. వీటి ఏర్పాటుకు గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం, పట్టణాల్లో 25 శాతం రాయితీ ఇస్తామన్నారు.

ల్యాభదాయకమేనా?

- సైన్స్ ల్యాబ్‌ల తనిఖీకి టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు
- బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
- 29, 30, 31 తేదీల్లో పాఠశాలల్లో ప్రయోగశాలల పరిశీలన



సైన్స్ ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు

రాయవరం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ప్రయోగాలు ఎంతో ఉపకరిస్తాయి. ఎందుకు.. ఏమిటి.. ఎలా.. అంటూ ప్రశ్నించేతత్వం విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ప్రభుత్వం విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇన్‌స్పైర్ మనక్, జిల్లా సైన్స్ కాంగ్రెస్ తరఫున ప్రయోగాలను నిర్వహిస్తోంది. ఈ ప్రయోగాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చాలంటే పాఠశాల స్థాయిలో నేర్చుకునే సైన్స్ పాఠాలకు అనుగుణంగా ప్రయోగాలను నిర్వహించాల్సిన అవసరం ఉంది. అందుకే ఇప్పుడు ప్రభుత్వం పాఠశాలల్లో సైన్స్ ప్రయోగాలు ఎలా నిర్వహిస్తున్నారు, విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలపై ఆసక్తిని పెంపొందిస్తున్నారా? లేదా? అనే విషయాలను తెలుసుకునేందుకు సైన్స్ ల్యాబ్‌ల తనిఖీకి టాస్క్‌ఫోర్స్ కమిటీని నియమించింది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అధికారులను టాస్క్‌ఫోర్స్ కమిటీలో సభ్యులుగా నియమించారు.

ప్రత్యేక ప్రాధాన్యం

విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని భావించిన ప్రభుత్వం సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఇప్పటికే పలు రకాల చర్యలు చేపట్టింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన విషయం అందరికీ తెలిసిందే. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి కల్పించేలా ప్రభుత్వం కృషి చేస్తోంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో సర్కారు బడుల విద్యార్థులు రాణించేలా తోడ్పాటునందిస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న సైన్స్ ల్యాబ్‌ల అమలుతీరును పరిశీలించేందుకు టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాకు రానుంది.

సర్కారు ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ల్యాబ్స్‌ల వినియోగాన్ని పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్ 29, 30, 31 తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనుంది. ల్యాబ్‌ల నిర్వహణ, ఉపయోగిస్తున్న విధానం, ల్యాబ్ రికార్డులు పరిశీలించనున్నారు. జనరల్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్ ల్యాబ్స్‌ను టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు పరిశీలించనున్నారు. గతంలో పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన గణితం, సైన్స్ కిట్స్ వినియోగంపై కూడా పరిశీలన చేస్తారు. టాస్క్‌ఫోర్స్ టీమ్‌లో రాష్ట్ర విద్యా పరిశోధన మండలి నుంచి ఒక నోడల్ అధికారి, సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి ఒక నోడల్ అధికారి, జిల్లా సైన్స్ అధికారులు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ఉంటారు. ల్యాబ్స్ పరిశీలన అనంతరం టాస్క్‌ఫోర్స్ కమిటీ నివేదికను రాష్ట్ర సమగ్ర శిక్షా ఉన్నతాధికారులకు అందజేస్తారు. ఈ మేరకు పాఠశాలల్లో ల్యాబ్‌ల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. కోనసీమ జిల్లాలో 89 ప్రాథమికోన్నత, 234 ఉన్నత పాఠశాలల్లో జనరల్ సైన్స్ ల్యాబ్‌లతో పాటుగా, 45 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు, జెడ్పీహెచ్ఎస్, మొగలికుదురు (మామిడికుదురు మండలం), రాజోలు, జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ దంగేరు (కె.గంగవరం మండలం)లో స్టెమ్ ల్యాబ్‌లు ఉన్నాయి.

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, అటల్ టింకరింగ్, స్టెమ్స్ ల్యాబ్‌ల వివరాలివీ

జిల్లా	యూపీ	హైస్కూల్స్	అటల్ ల్యాబ్స్	స్టెమ్ ల్యాబ్స్
కోనసీమ	89	234	45	03
కాకినాడ	105	245	49	02
తూర్పు	69	193	32	03



స్టెమ్ ల్యాబ్

ప్రయోగాలకు మంచిరోజులు



సైన్స్ ల్యాబ్స్‌లో ప్రయోగాలకు మంచిరోజులు వచ్చాయి. ప్రభుత్వం వాటిని బలోపేతం చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్టెమ్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సైన్స్‌కు ఇస్తున్న ప్రాధాన్యాన్ని ప్రభుత్వం చెప్పకనే చెబుతోంది.

– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, అమలాపురం

సిద్ధంగా ఉండాలి



జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ల్యాబ్‌లను టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేస్తోంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ల్యాబ్‌ల తనిఖీకి సిద్ధంగా ఉండాలి. సైన్స్ ల్యాబ్‌ల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ల్యాబ్‌ల తనిఖీని చేపడుతున్నారు.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అల్లవరం: జిల్లాలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ దుర్గారావు దొర గురువారం తెలిపారు. నర్శిపూడి సచివాలయం (ఆలమూరు మండలం), గోడి ఎంపీపీ స్కూల్ (అల్లవరం), సాకుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (అమలాపురం రూరల్), ఇరుసుమండ సెయింట్ జోసఫ్ హైస్కూల్ (అంబాజీపేట), తాడిపూడి సచివాలయం (ఆత్రేయపురం), తాళ్లపాడు ఎంపీపీ స్కూల్ (కె.గంగవరం), వడ్లమర్రు సచివాలయం (కపిలేశ్వరపురం), పెనుమళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (కాట్రేనికోన), గంటి చౌల్ట్రీ బిల్డింగ్ (కొత్తపేట), గూడపల్లి-2 ఎంపీయూపీ స్కూల్ (మలికిపురం), ఆదుర్రు జిల్లా ఉన్నత పాఠశాల (మామిడికుదురు), తాపేశ్వరం-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మండపేట), ముంగండ-2 సచివాలయం (పి.గన్నవరం), వెలమపాలెం సచివాలయం (రామచంద్రపురం), రాజోలు-4 జిల్లా బాలికల ఉన్నత పాఠశాల (రాజోలు), విద్యుత్‌నగర్ షాదీ ఖానా కల్యాణ మండలం (అమలాపురం రూరల్) ప్రాంతాల్లో సురక్ష శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

ఓటుహక్కు నమోదుపై ప్రత్యేక దృష్టి

అమలాపురం రూరల్: ఓటుహక్కు నమోదుపై జిల్లాలో వివిధ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు వెల్లడించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ చాంబర్‌లో జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం ముసాయిదా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీలకు అందజేస్తామన్నారు. శుక్రవారం నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. డిసెంబర్ 26న క్లెయిమ్స్ అభ్యంతరాలు పరిష్కరిస్తామని తెలిపారు. 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురిస్తామన్నారు. అలాగే ప్రత్యేక శిబిరాల ద్వారా కొత్త ఓటర్ల నమోదు దిశగా కార్యాచరణ చేస్తున్నామన్నారు. జిల్లాకు సంబంధించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ప్రాథమిక స్థాయి పరిశీలన ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో నవంబర్ 10వ తేదీ వరకూ ఉంటుందన్నారు. ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి, నాయకులు అల్లాడి స్వామినాయుడు పాల్గొన్నారు.

వైవిధ్య ఆలోచనలతో ముందుకెళ్లండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాబార్డ్ జిల్లా మేనేజర్ సోమునాయుడు

అమలాపురం టౌన్: గ్రామీణ వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి సహకార సంఘాలు వైవిధ్య భరిత ఆలోచనలతో ముందుకు వెళ్లాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాబార్డ్ మేనేజర్ వై.సోము నాయుడు అన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్ (న్యూఢిల్లీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ (విజయవాడ) ఆధ్వర్యంలో అమలాపురంలో సహకార సంఘాల సభ్యులకు రెండో రోజు గురువారం శిక్షణ కార్యక్రమాలు కొనసాగాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సోమునాయుడు మాట్లాడుతూ సహకార సంఘాలు తమ వ్యాపారంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి నాబార్డ్ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో ఉన్న ఆర్థిక వనరులు వినియోగించుకోవాలన్నారు. డీసీసీబీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.శ్రీధర్ చౌదరి మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి కార్యాచరణ గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు ఇస్తున్న వివిధ పథకాల గురించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు మాట్లాడుతూ సంఘ సీఈఓల విధులు, బాధ్యతల గురించి తెలియజేశారు. జిల్లా ఆడిట్ అధికారి ఎస్.మురళీకృష్ణ సహకార ఆడిట్‌పై అవగాహన కల్పించారు. సహకార సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆలయాల మూసివేత

సఖినేటిపల్లి/ అయినవిల్లి: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం జిల్లాలోని ప్రముఖ ఆలయాలను మూసివేయనున్నారు. 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ గురువారం తెలిపారు. 29న సంప్రోక్షణ అనంతరం ఉదయం 8–30 గంటలకు తిరిగి దర్శనాలు ప్రారంభిస్తామన్నారు. కాగా ఉదయం స్వామికి నిర్వహించే నిత్య అర్జిత అభిషేకం రద్దు చేస్తున్నట్లు, సుదర్శన హోమం యథాతథంగా జరుగుతుందని వివరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం ఐదు గంటలకు మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ప్రకటించారు. ఆదివారం ఆలయంలో సంప్రోక్షణ అనంతరం ఉదయం ఏడు గంటలకు యథావిధిగా పూజలు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరారు.

‘జగనన్న సురక్ష’తో అందరికీ ఆరోగ్యం

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- బండారులంకలో వైద్య శిబిరం పరిశీలన



బండారులంకలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. గురువారం బండారులంక ఉన్నత పాఠశాలలో ఏర్పాటైన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇందులో భాగంగా ఆశ, ఏఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి వివిధ సమస్యలతో బాధపడుతున్న వారికి టోకెన్లు ఇచ్చి గ్రామాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా వైద్యం పొందేలా చూస్తున్నారన్నారు. ఈ శిబిరాల్లో ఉచితంగా ల్యాబ్ పరీక్షలు చేయడమే కాకుండా మందులను అందజేస్తున్నారన్నారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకంలో నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్య సేవలు అందిస్తున్నామని ఆయన వివరించారు. నేత్ర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు పొందిన తరువాత సంబంధిత రోగికి అవసరమైన మందులు అందేలా ఆరోగ్య సురక్ష ద్వారా మ్యాపింగ్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, తహసీల్దార్ పరమట శ్రీపల్లవి, ఎంపీడీఓ జె.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పెనుమాల సునీత, ఉప సర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు అంకం పెదరాజు, గుత్తుల జానకిలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి జాన గణేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సరేళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పప్పుల మిల్లు సముదాయం పరిశీలన

రాయవరం: మాచవరంలో నిర్మాణంలో ఉన్న మహాలక్ష్మి పల్సస్ మిల్లు సముదాయాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించారు. మిల్లు నిర్మాణానికి సంబంధించిన ప్లానింగ్, మిషనరీ ఏర్పాటుకు ప్రారంభించిన సివిల్ పనులను ఆయన పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ మిల్లు మంజూరైంది. ఈ నిర్మాణంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం, క్లస్టర్ సముదాయంలో ఉన్న సభ్యులు 10 శాతం కంట్రిబ్యూషన్ చెల్లించారు. నిధులు మంజూరైన నేపథ్యంలో నిర్మాణ పనులు ఏ విధంగా జరుగుతున్నాయన్న విషయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పనులను వేగవంతం చేయాలని క్లస్టర్ సభ్యుడు సబ్బెళ్ల కాశీఈశ్వరరెడ్డికి సూచించారు. ఈ పర్యటనలో పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, ఏడీ శివరామ్‌ప్రసాద్, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు ఉన్నారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలసి స్థానిక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

వైభవంగా జక్కంపూడి వారి పెళ్లి సందడి



జక్కంపూడి కుటుంబంతో ముచ్చటిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

- వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ఉభయ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన అభిమాన గణం
- విందు, వినోదాలతో అబ్బురపరిచేలా ఏర్పాట్లు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కేరళ నృత్యాలు



హెలిపాడ్ నుంచి వస్తున్న సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న జనం



సీఎం జగన్‌కు అభివాదం చేస్తున్న జనం



వివాహానికి హాజరైన జన సందోహం

రాజానగరం: స్థానిక శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సోదరుడు, వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావుకు ఉభయ గోదావరి జిల్లాల్లోనే కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న అభిమానమంతా ఉవ్వెత్తున ఎగసివచ్చిందా అన్నట్టుగా అభిమాన గణం భారీఎత్తున తరలివచ్చి, ఆయన ద్వితీయ కుమారుడైన గణేష్ దంపతులను ఆశీర్వదించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి నేరుగా దివాన్‌చెరువుకు హెలికాప్టర్‌లో వచ్చి, నూతన వధూవరులైన జక్కంపూడి గణేష్, సుకీర్తిలను ఆశీర్వదించి, కొద్దిసేపు వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఈ సమయంలో కొంతమంది సీఎంతో సెల్ఫీలకు రిక్వెస్టు చేయడంతో అందుకు ఆయన చిరునవ్వుతో వారికి అవకాశం ఇచ్చారు. కుటుంబ సభ్యులే కాకుండా బంధువర్గంలోని వారు, అభిమానులు సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపించారు.

సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో..

ఆహ్వానితులలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో సినిమా సెట్టింగ్‌లను తలపించేలా చేసిన ఏర్పాట్లు అందరినీ అబ్బురపరిచాయి. వివాహ రిసెప్షన్ వేదికపై యశస్వి కొండేపూడి మ్యూజిక్ బ్యాండ్ లైవ్‌తోపాటు సింగర్ శిల్ప, యాంకర్ దీప్తి నల్లమోతు, మిమిక్రీ రాజు, గోవింద్ డ్యాన్స్ టీమ్ లైవ్ ప్రోగ్రామ్స్ అలరించాయి. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, రంగుల రాట్నం, ‘పెట్టా తులాల్’ కేరళ నృత్యం, ప్రకృతి ఒడిలోకి వచ్చామా అనే రీతిలో ఆసక్తి ఉన్నవారు ఫొటో షూట్‌లు తీసుకునేలా వేసిన సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక భోజన సదుపాయాల గురించి ప్రస్తావిస్తే .. ‘ఆహా .. ఏమి రుచి, తినరా మైమరిచి..’ అనేవిధంగా 24 రకాల వంటకాలతో ఆహార ప్రియుల మదిని దోచారని చెప్పవచ్చు.

ముఖ్యమంత్రి జగన్‌కు ఘన స్వాగతం

జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్‌కి గురువారం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తాడేపల్లి నుంచి నేరుగా హెలికాప్టర్‌లో దివాన్‌చెరువులోని డీబీవీ రాజు లేఅవుట్‌లోని హెలిపాడ్‌పై దిగిన ఆయనకు ఆహ్వానకర్త, స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆయన తల్లి జక్కంపూడి విజయలక్ష్మితో పాటు మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, అంబటి రాంబాబు, తానేటి వనిత, ఆర్‌కే రోజా, దాడిశెట్టి రాజా, గుడివాడ అమర్‌నాథ్, పినిపే విశ్వరూప్, కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, రాజంపేట ఎంపీ పీవీ మిధున్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, అనంతబాబు, వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పెండెం దొరబాబు, జ్యోతుల చంటిబాబు, తలారి వెంకట్రావు, కొండేటి చిట్టిబాబు, జె.శ్రీనివాస్‌నాయుడు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, రాజమహేంద్రవరం సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్, రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, పలువురు ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలికారు. సినీ ప్రముఖులు రామ్‌గోపాల్‌వర్మ, సుమన్, హీరో విశ్వక్‌సేన్‌లు గణేష్, సుకీర్తిలకు ఆశీస్సులు అందజేశారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

రామచంద్రపురం: స్థానిక యువనగర్‌కు చెందిన వివాహిత దూళిపూడి మేరీకుమారి (22) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేశామని రామచంద్రపురం ఎస్సై డి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన వడగల సత్యనారాయణ, ఆదిలక్ష్మిల కుమార్తె మేరీకుమారికి పట్టణంలోని యువనగర్‌కు చెందిన ధూళిపూడి శంకరసత్యనారాయణతో 2020లో వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు కుమార్తెలు. కాగా బుధవారం రాత్రి ఫిట్స్ రాగా మేరీ కుమారిని భర్త శివశంకర్ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అర్ధరాత్రి మేరీ కుమారి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తన కుమార్తెను ఉరి వేసి హతమార్చారని తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు చేయటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో విశ్రాంత ఉపాధ్యాయుడు..

రామచంద్రపురం అఫీషియల్ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుండుబోను సాంబశివరావు (75) తన ఇంట్లో మంచంపై అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై డి.సురేష్ బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గుండుబోను సాంబశివరావు తన ఇంట్లో మంచంపై నుదుటపై, మెడపై గాయాలతో పడి మృతి చెందాడు. అయితే సాంబశివరావు కుమారుడు శ్రీనివాస్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కనిపించడం లేదని ఎస్సై తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

జూనియర్ అసిస్టెంట్లకు పరీక్ష

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో సంబంధిత యూనిట్ అధికారులచే అర్హులుగా ప్రతిపాదించిన జూనియర్ అసిస్టెంట్లకు టైపిస్టులకు ప్రొఫెషియెన్సీ ఇన్ ఆఫీస్ ఆటోమేషన్ విత్ యూసేజ్ ఆఫ్ కంప్యూటర్ అండ్ అసోసియేటెడ్ సాఫ్ట్‌వేర్ అంశంలో క్వాలిఫైయింగ్ పరీక్ష నిర్వహిస్తున్నారు. దీనిని ఈ నెల 29, నవంబర్ 5వ తేదీల్లో ఉదయం 10 గంటలకు కాకినాడ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌సీ డిపార్టుమెంట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ కృతికా శుక్లా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు శాఖా పరంగా జారీ చేసిన తమ లేటెస్ట్ ఫొటో ఐడెంటిటీ కార్డులతో ఈ పరీక్షకు హాజరు కావాలని తెలిపారు.

నిందితుడికి రిమాండ్

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంక గ్రామానికి చెందిన బత్తుల ప్రేమజ్యోతిపై ఆమె భర్త బత్తుల గంటయ్య బుధవారం హత్యాయత్నం చేసినట్లు కేసు నమోదైంది. ఈ మేరకు గురువారం నిందితుడు గంటయ్యను పోలీసులు అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టుకు తరలించారు. కోర్టు ఆదేశాలతో అతన్ని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ వివరించారు.

ఆనందం నిండేలా.. ఆహ్లాదం పంచేలా


మండపేటలో రావులపేట చెరువును అభివృద్ధి చేసేందుకు నీటిని తోడేసి..


అమలాపురంలో గరిగుంట చెరువు అభివృద్ధి పనులు

- చెరువులకు పునరుజ్జీవం
- ఉమ్మడి తూర్పుగోదావరిలో 19 చెరువులకు మహర్దశ
- రూ. 24.48 కోట్ల నిధులు మంజూరు
- ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్ పర్యవేక్షణలో పనులు

మండపేట: చెరువులకు పునరుజ్జీవం వస్తోంది.. చూడచక్కగా ఆహ్లాదాన్ని పంచేలా సిద్ధమవుతోంది.. చుట్టూ వనాలు, ఆపై సుందరీకరణ, జిమ్, ఆట పరికరాలతో అభివృద్ధి సంతరించుకోనుంది. మండపేట రావులపేటలో సుమారు ఎకరన్నర విస్తీర్ణంలోని రెండు చెరువులు నడవడానికి వీలులేకుండా చుట్టూ పొదలతో నిండి ఉన్నాయి. జనావాసాల మధ్యలో ఉన్నా అభివృద్ధికి నోచుకోక కేవలం పశువులను కడగడానికి, చేపల పెంపకానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. ఈ చెరువులను ఆహ్లాదాన్ని పంచే పార్కులుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం రూ.1.12 కోట్లు మంజూరు చేయగా పనులు మొదలయ్యాయి. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చాలాచోట్ల పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధికి నోచుకోక ఆక్రమణలతో కుచించుకుపోయి, పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోయి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా, మురుగునీటితో అధ్వానంగా తయారైన చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీయూజీబీసీ) ద్వారా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే విధంగా వాటిని పటిష్టం చేసి కొత్తరూపు తెస్తోంది. అమృత్ 2.0 పథకం కింద ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు కొవ్వూరు, నిడదవోలు మున్సిపాలిటీల్లో మొత్తం 19 చెరువుల అభివృద్ధికి రూ.24.48 కోట్లు మంజూరు చేసింది. కాకినాడ జిల్లాలో పది చెరువులకు రూ.14.4 కోట్లు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నాలుగు చెరువులకు రూ.3.68 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో ఐదు చెరువులకు రూ.6.4 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయా చెరువులను అభివృద్ధి చేసేందుకు ఏపీయూజీబీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

పూర్తిస్థాయిలో ప్రగతి

ఈ నిధులతో ఆయా చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలు తొలగించి రక్షణ కంచె నిర్మిస్తారు. చెరువులో నీటిని పూర్తిగా తోడి పూడిక తొలగిస్తారు. గట్లు పటిష్టం చేస్తారు. వ్యర్థాలు, కలుషిత జలాలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటారు. చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణం, పచ్చదనం పరుస్తూ మొక్కలు నాటుతారు. వ్యాయామం చేసేందుకు జిమ్ పరికరాలు, చిన్నారులు ఆడుకునేందుకు అవసరమైన ఆట పరికరాలతో ప్లే స్టేషన్లు ఏర్పాటు చేస్తారు. ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా పార్కులుగా ఈ చెరువులను అభివృద్ధి చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి మండపేటలో రావులపేట చెరువు, అమలాపురం గరిగుంట చెరువు, రామచంద్రపురంలో కొత్తూరు చెరువు, ముమ్మిడివరం నగర పంచాయతీలో పోలమ్మ చెరువులను ఎంపిక చేశారు. మండపేట మున్సిపాలిటీకి సంబంధించి రావులపేటలోని రెండు చెరువుల అభివృద్ధికి అధికారులు పనులు ప్రారంభించారు. పూడికతీత పనుల కోసం ఒక చెరువులో నీటిని మొత్తం తోడేశారు. దీంతో ఈ చెరువులకు కొత్తరూపు రానుంది.

పట్టణాల్లో చెరువుల అభివృద్ధికి మంజూరైన నిధులు

పట్టణం	మంజూరైన నిధులు
కాకినాడ జిల్లా	
కాకినాడ	రూ.8.47 కోట్లు
పిఠాపురం	రూ.1.21 కోట్లు
పెద్దాపురం	రూ.1.16 కోట్లు
సామర్లకోట	రూ.1.14 కోట్లు
తుని	రూ.1.04 కోట్లు
ఏలేశ్వరం	రూ.64 లక్షలు
గొల్లప్రోలు	రూ.74 లక్షలు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా	
మండపేట	రూ.1.12 కోట్లు
అమలాపురం	రూ.1.02 కోట్లు
రామచంద్రపురం	రూ.90 లక్షలు
ముమ్మిడివరం	రూ.64 లక్షలు
తూర్పుగోదావరి జిల్లా	
రాజమహేంద్రవరం	రూ.4.64 కోట్లు
నిడదవోలు	రూ.88 లక్షలు
కొవ్వూరు	రూ.88 లక్షలు

త్వరలోనే అందుబాటులోకి..



మండపేటలో రావులపేట చెరువు అభివృద్ధి పనులు మొదలయ్యాయి. జనావాసాల మధ్యలో ఉన్న ఈ చెరువులను ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా తీర్చిదిద్దనున్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ తదితర సదుపాయాలు కల్పిస్తారు. ఇవి త్వరలోనే ప్రజలకు అందుబాటులో రానున్నాయి.

– టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, మండపేట

యువతి మృతదేహం లభ్యం

అంబాజీపేట: కుటుంబ సభ్యులు మందలించారనే మనస్తాపంతో మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువతి మృతదేహం వైనతేయ గోదావరి నదీ పాయలో గురువారం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. పుల్లేటికుర్రుకు చెందిన చీకురుమిల్లి సిరి (19) ఈ నెల 24న ఇంటి నుండి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. అదేరోజు రాత్రి బోడసకుర్రు బ్రిడ్జి వద్ద ఆమె స్కూటీ, సెల్ ఫోన్ ఉంచి గోదావరిలోకి దూకి సిరి ఆత్మహత్య చేసుకుందని సమాచారం. మూడు రోజుల నుంచి సిరి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా తొండవరం వైనతేయ గోదావరి నదీ పాయలో శవమై కనిపించింది. మృతురాలి తండ్రి మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వరప్రసాద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి


లోవరాజు (ఫైల్)

కె.గంగవరం: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన మండలంలోని కోట గ్రామంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కోటకు చెందిన ఆచంట భద్రరావుకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు ఆచంట లోవరాజు (23) ఆ గ్రామంలో రోడ్డు పక్కన స్వామి మాలధారుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగలడంతో విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకూ అందరితో మాట్లాడుతూ ఉన్న లోవరాజు అకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

30 వీఐపీ సత్రం కూల్చివేత

- అక్కడే విశ్రాంతి షెడ్డుకు సన్నాహాలు
- రూ.1.99 కోట్లతో నిర్మించనున్న లారెల్స్ కంపెనీ

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పశ్చిమ రాజగోపురం ఎదురుగా ఉన్న 30 వీఐపీ సత్రం (శ్రీసత్యదేవ గెస్ట్‌హౌస్) కూల్చివేత పూర్తయ్యింది. సత్రం కూల్చివేయగా వచ్చిన వ్యర్థాలను కూడా బయటకు తరలించారు. అక్కడ సత్రం ఉండేదన్న ఆనవాళ్లు లేవు. కార్తిక మాసంలో వేలాదిగా వచ్చే భక్తుల కోసం ఆ సత్రం స్థలంలో విశ్రాంతి షెడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడ సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీ రూ.1.99 కోట్లతో శాశ్వత ప్రాతిపదికన 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పున విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించడానికి సుముఖత వ్యక్తం చేసింది. దేవస్థానం అధికారులు అందజేసిన ప్లాన్ ప్రకారం షెడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అయితే కార్తిక మాసంలోపు ఈ షెడ్డు నిర్మాణం పూర్తయ్యే అవకాశం లేకపోవడంతో తాత్కాలికంగా 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పున విశ్రాంతి షెడ్డు నిర్మిస్తున్నారు. సుమారు రెండు వేల మంది భక్తులు సేదతీరేలా దీనిని నిర్మించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. అద్దె ప్రాతిపదికన ఈ షెడ్డు నిర్మించనున్నట్లు వివరించారు. విజయవాడ దుర్గ గుడి దేవస్థానంలో భక్తులు సేదతీరేందుకు ఏటా దసరా సీజన్‌లో వేసే షెడ్డు లాంటిదే ఇక్కడా వేయిస్తున్నట్లు చెప్పారు. కార్తిక మాసం అనంతరం శాశ్వత ప్రాతిపదికన షెడ్డు నిర్మిస్తామన్నారు.


సత్రం కూల్చివేసిన తర్వాత ఖాళీ స్థలం


సత్యదేవుని పశ్చిమ రాజగోపురం ఎదురుగా 30 వీఐపీ సత్రం (కూల్చివేతకు ముందు)

బాలికపై వృద్ధుడి పైశాచికం

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి రాజమహేంద్రవరం రూరల్ మండలం శానిటోరియం చెంచుకాలనీకి చెందిన బాలిక (7)పై డబ్బై ఏళ్ల వృద్ధుడు పైశాచికత్వం ప్రదర్శించాడు. తండ్రి సిగరెట్లు తీసుకురమ్మని కిరాణా కొట్టుకు పంపిన నేపథ్యంలో అదే ప్రాంతానికి చెందిన వృద్ధుడు ఆ బాలికను దగ్గరకు రమ్మన్నాడు. వచ్చిన ఆమెకు చాక్లెట్ ఆశ చూపిస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. భయంతో పరుగు తీసిన ఆ బాలిక తనపై వృద్ధుడు చేసిన చేష్టలను తెలియజేసింది. దీంతో ఇరుగు పొరుగు వారు కూడా చేరుకుని ఆ వృద్ధుడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. బుధవారం జరిగిన ఈ సంఘటనపై తమకు అందిన సమాచారం మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని సీఐ కాశీవిశ్వనాథ్ గురువారం తెలిపారు.

అన్నదాన భవనానికి విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి వెంకన్న ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరానికి చెందిన దొంతంశెట్టి వీరభద్రరావు, కనకదుర్గ దంపతులు రూ.70,116 విరాళం సమర్పించారు. గురువారం ఈ విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. దాతకు ఆలయ సిబ్బంది చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.



ట్రాలీ, ఆర్టీసీ బస్సు ఢీ

- 35 మంది ప్రయాణికులు సురక్షితం
- తిమ్మాపురం వద్ద ఘటన

కాకినాడ రూరల్: కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు తిమ్మాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురైంది. అయితే ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బస్సు ముందు భాగం దెబ్బతింది. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ డిపో నుంచి విశాఖపట్నంకు ప్రయాణికులతో నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం పయనమైంది. తిమ్మాపురం పోలీసు స్టేషన్ దాటి కొద్దిదూరం వెళ్లేసరికి మలుపు వద్ద ఎదురుగా విశాఖ పోర్టు నుంచి కాకినాడ పోర్టుకు ఖాళీ కంటైనర్ బాక్సులతో వస్తున్న ట్రాలీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కాకినాడకు చెందిన బస్సు డ్రైవర్ ఎం.శ్రీనివాస్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. చివరికి ఆయన ప్రాణాలతో బయటపడ్డాడు. ఆయన కాలు విరిగిపోయింది. బస్సులోని కాకినాడకు చెందిన ప్రయాణికురాలు రక్షిత (21), సాయి (10) గాయపడ్డారు. ప్రమాద సమయానికి బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. ట్రాలీ ఏ మాత్రం వేగంగా వచ్చినా ప్రమాదం ఘోరంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. తన తప్పిదం లేదని బస్సు డ్రైవర్ పోలీసులకు రాత పూర్వకంగా తెలియజేశారు. ఈ మేరకు తిమ్మాపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద స్థలాన్ని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్, బాలకృష్ణ పరిశీలించారు. ప్రయాణికులను వేరే బస్సు ఎక్కించి తమ గమ్యస్థానాలకు పంపించారు.


ప్రమాద స్థలంలో ట్రాలీ, బస్సు

కల్యాణ వైభోగం

- ద్వారకాతిరుమలలో శ్రీవారి కల్యాణం
- నేడు శ్రీవారి రథోత్సవం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల క్షేత్రంలో శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తిరుకల్యాణం గురువారం అట్టహాసంగా జరిగింది. దీనికి ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం వేదికైంది. ముందుగా స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి రెండు వేర్వేరు వాహనాలపై మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి అర్చకులు వేడుకను ప్రారంభించారు. వివిధ ఘట్టాలను పూర్తిచేసిన తరువాత శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఆయన కుమారుడు ఎస్వీ నివృతరావు, కుటుంబ సభ్యులు శ్రీవారికి పట్టువస్త్రాలను సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావులు అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందజేశారు. స్వామివారు ఉదయం సూర్యప్రభ, కల్యాణ వేడుక అనంతరం రాత్రి వెండి గరుడ వాహనాలపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు పర్యవేక్షించారు. ఈ వేడుకలో ఏలూరు జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, టీటీడీ ట్రస్టుబోర్డు సభ్యులు మేకా శేషుబాబు, గాదిరాజు సుబ్బరాజు పాల్గొన్నారు.


కల్యాణ మూర్తులకు హారతులిస్తున్న అర్చకులు


అమ్మవార్లకు పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న హోం మంత్రి వనిత, గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు

విజ్ఞాన దీపిక.. సృజనకు వేదిక

- సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు అడుగులు
- 31వ జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు సన్నాహాలు
- నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): చిన్నారులను భావిభారత శాస్త్రవేత్తలుగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించేందుకు జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలు ఏటా జరుపుతున్నాయి. చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఏర్పాటు చేయగా, రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశం. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికి తీయడానికి ఇది చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. నవంబర్ 9, 10 తేదీల్లో కాకినాడలో జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేస్తుండగా ఇప్పటి వరకూ 172 టీమ్‌లు రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి.

ఐదు విభాగాల్లో పోటీలు

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని యాజమాన్యాల పరిధిలోని 6–12 తరగతుల విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2023లో పాల్గొనవచ్చు. పాఠశాలలకు వెళ్లే వారితో పాటు పది నుంచి 17 ఏళ్ల లోపు బడి మానేసిన వారూ ఇందులో పాలుపంచుకోవచ్చు. జిల్లా స్థాయి వరకు 10–17 ఏళ్ల లోపు వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 నుంచి 14 ఏళ్ల లోపైతే జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు సీనియర్లుగా విభజించారు.



గత ఏడాది జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీప్రకాష్ పాఠశాల విద్యార్థి రుచికి బహుమతి అందజేస్తున్న మంత్రి రోజా (ఫైల్)

సమస్యలకు పరిష్కారం చూపేలా..



బాలలు పరిశోధనలు చేసే దిశగా సమాయత్తం చేయడమే సైన్స్ కాంగ్రెస్ లక్ష్యం. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే విధంగా పరిశోధనలు ఉండాలి. దీనిపై ఇప్పటికే సైన్స్ ఉపాధ్యాయులకు డివిజన్ స్థాయిలో శిక్షణ ఇచ్చాం. పాఠశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రాజెక్టుల ఉండాలి. రిజిస్ట్రేషన్ కోసం 99127 03697 నంబరుకు ఫోన్ చేయవచ్చు.

– కేసరి శ్రీనివాసరావు, బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్

చక్కని వేదికగా భావించాలి



జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలకు ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాలి. సైన్స్ ఉపాధ్యాయులు విద్యార్థులతో ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల రూపకల్పనకు మార్గదర్శకత్వం వహించాలి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనల పట్ల ఆసక్తి, అభిరుచి పెంచడానికి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక చక్కని వేదికగా భావించాలి.

–జి.నాగమణి, డీఈవో, కాకినాడ

రూపకల్పన ఇలా..

జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే నమూనాలుగా ఉండాలి. సమస్య పరిష్కార పద్ధతిలో ప్రాజెక్టులు నిర్వహించాలి. ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా ప్రాజెక్టు చేయాలి. నిర్దిష్టమైన చక్కని శీర్షికతో, సంబంధిత నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి. ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో సమర్పించాలి. 250 పదాలకు మించకుండా సంక్షిప్త రూపం రాయాలి. ఈ ఏడాది ఆరోగ్యం, శ్రేయస్సు, పర్యావరణం ప్రధాన అంశాలుగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేయాల్సి ఉంది. ఇందులో ఐదు ఉప అంశాల్లో నమూనాలు సిద్ధం చేసుకోవచ్చు.